నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 17 మార్చి 2025 SANGAREDDY




సిద్దిపేటలో చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## సిద్దిపేటపై కక్షకట్టిన కాంగ్రెస్ సర్కార్

- అభివృద్ధి పనులు ఆపడంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా
- మెదక్ జిల్లాకు అన్యాయం చేస్తున్న సీఎం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- సిద్దిపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

సిద్దిపేట, మార్చి 16: సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టి అడ్డుకుంటున్నదని, ఈ అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 184 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలన ఎలా ఉండేదో, ఇప్పుడు కాంగ్రెస్ పరిపాలన ఎలా ఉందో ప్రజలకు బాగా అర్థం అయ్యిందన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో మళ్లీ కరెం ట్ కష్టాలు మొదలైనట్లు తెలిపారు. ప్రజలకు అనేక హామీలు, ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలకు అతీగతి లేకుండా పోయిందన్నారు. రూ.4వేల పింఛన్ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఇచ్చిన రూ.2వేల పింఛన్ రెండు నెలలు ఎగ్గొట్టాడని విమర్శించారు. 15 నెలలు గడిచినా రూ.4 వేల పింఛన్ ఊసేలేదన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, మహాలక్ష్మి కింద మహిళలకు రూ. 2500 ఇస్తామని చెప్పిన మాటలు ఉత్తవి అయ్యాయని విమర్శించారు. రైతులకు రూ. 15 వేలు రైతుభరోసా అని చెప్పి వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టారన్నారు. రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు మాటలు చెబుతూ కాలక్షేపం చేస్తున్నాడని హరీశ్‌రావు విమర్శించారు. పేదల కోసం కేసీఆర్ ఎప్పుడూ ఆలోచించారని, కరోనా సమయంలోనూ రైతుబంధు ఆపలేదని, పింఛన్ ఠంచన్‌గా ఇచ్చారని హరీశ్‌రావు గుర్తుచేశారు.

**సిద్దిపేటపై సీఎంకు మంట..**

సీఎం రేవంత్ సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట వెటర్నరీ కాలేజ్ కొడంగల్‌కు తరలించుకు పోయాడని, నర్సింగ్ కళాశాల, వెయ్యి పడకల దవాఖాన, రంగనాయక సాగర్ టూరిజం, శిల్పారామం, పోలీస్‌స్టేషన్ పనులు ఆపారని విమర్శించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో గళం విప్పుతానని పేర్కొన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ బాగా పడిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరందిస్తే, బుద్ధిలేని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పంటలు ఎండబెట్టిందని హరీశ్‌రావు విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై బాలుడి లైంగిక దాడి

పటాన్‌చెరు, మార్చి 16 : బాలికపై పదిహేనేండ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఆదివారం వెలుగుచూసింది. పటాన్‌చెరు పోలీసుల వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని గొల్లబస్తీలో నివాసం ఉంటున్న 15 ఏండ్ల బాలుడు తమ ఇంట్లో అద్దెకుండే పదేండ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. అమ్మాయి తల్లిదండ్రులకు ఈ విషయం ఆలస్యంగా తెలపడంతో పటాన్‌చెరు పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికను చికిత్స కోసం సంగారెడ్డిలోని భరోసా సెంటర్‌కు తరలించారు. బాలుడిని జువైనల్ కోర్టుకు పంపించారు.

## కారు, ఆర్టీసీ బస్సు ఢీ: 14 మందికి గాయాలు



రామాయంపేట, మార్చి 16: మెదక్ జిల్లా రామాయంపేట బైపాస్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు, ఆర్టీసీ బస్సు ఢీకొని 14 మంది ప్రయాణికులు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి వస్తున్న కారు బైపాస్ నుంచి రామాయంపేటకు వెళ్తుండగా, కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు కారును ఢీకొట్టి డివైడర్‌ను తాకింది. ఈ ఘటనలో గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో రామాయంపేట దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పైలెట్ గ్రామాల్లో పథకాల అమలేదీ!

### హడావిడి చేసి మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అమలుకాని సంక్షేమ పథకాలు

- ఆందోళనలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు
- మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఆలస్యం
- సర్కారు తీరుపై పెదవి విరుస్తున్న ప్రజలు
- స్పష్టత ఇవ్వని అధికారులు

మెదక్, మార్చి 16(నమస్తే తెలంగాణ): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2025, జనవరి 26న పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి నియోజకవర్గంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పథకాల గ్రౌండింగ్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో అర్హులందరికీ వందశాతం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ, క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. పైలెట్ గ్రామాలుగా ఎంపికైన మెదక్ జిల్లా హవేళీ ఘనపూర్ మండలం కొచ్చెరువు తండా, కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలుపై 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్ చేసింది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో నిబంధనల ప్రకారం రైతుభరోసా మినహా మిగతా మూడు పథకాలు నిలిచిపోయాయి. ఇప్పుడు కోడ్ ముగిసినా ఇప్పటి వరకు కొచ్చెరువు తండా, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ఊసేలేదు. ఒక్క ఆత్మీయ భరోసా మాత్రమే అర్హులందరికీ వచ్చింది. కానీ, రైతుభరోసా మాత్రం పూర్తిస్థాయిలో కాలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

**అంతంతమాత్రంగానే...**


మెదక్ జిల్లా హవేళీ ఘనపూర్ మండలం కొచ్చెరువు తండాలో 512 మంది జనాభా ఉంది. 120 గృహాలు ఉన్నాయి. ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 181 మంది దరఖాస్తులు చేసుకోగా, 27 మందికి మాత్రమే మంజూరయ్యాయి. ఈ తండాలో ఇప్పటి వరకు ఒక్క ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మొదలు పెట్టలేదు. లబ్ధిదారులకు ఉన్న ఖాళీ స్థలాల్లో మాత్రమే ముగ్గుపోసి వదిలేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 54 మందికి డబ్బులు మంజూరయ్యాయి. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లిలో 310 ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా, 59 ఇండ్లు మాత్రమే మంజూరయ్యాయి. కేవలం 2 ఇండ్లు మాత్రమే గ్రౌండ్ లెవల్‌లో ఉన్నాయి. వాటికి కూడా బిల్లులు రాలేదు. జిల్లాలో ఇప్పటి వరకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలు, వార్డుల్లోనే పథకాలను అమలు చేసిన ప్రభుత్వం మిగతా గ్రామాలు, వార్డుల్లో అమలు విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. అర్హులందరికీ ఒకేసారి ఇస్తారా..? లేక విడతల వారీగా ఇస్తారా అనే దానిపై కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొదటి విడతలో ఇస్తామని చెప్పారు. మిగతా గ్రామాల్లో ఏ వర్గానికి ఎప్పుడు ఇస్తారనే విషయమై స్పష్టత లేక దరఖాస్తుదారులు అయోమయంలో ఉన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినా ఇంకా ఇందిరమ్మ ఇండ్లను మొదలుపెట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వస్తేనే పథకాల అమలుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు నివృత్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి.



హవేళీఘనపూర్ మండలం కొచ్చెరువు తండాలో ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోస్తున్న లబ్ధిదారుడు



మెదక్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆగిపోయిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణం



కొచ్చెరువు తండా వ్యూ

**పూర్తి కానీ నమూనా ఇంటి నిర్మాణం...**

జనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు మంజూరు చేసింది. అదే రోజు జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేసి ఆ గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాలు వంద శాతం అమలయ్యేలా చూస్తామని చెప్పింది. కానీ, ఇండ్లు మంజూరై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇండ్ల నిర్మాణాలు మొదలు కాలేదు. అంతేకాదు ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మెదక్ జిల్లాలో 1,555 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం నాలుగు విడతల్లో అందజేస్తామని ప్రభుత్వం చెప్పింది.

## శభాష్ సల్మా నేహా

- నాలుగు ఉద్యోగాలు సాధించిన యువతిని అభినందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



సల్మా నేహాను అభినందిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 16: నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సల్మా నేహాను ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. ఆదివారం సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో హరీశ్‌రావును ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో తాము కిరాయి ఇంట్లో ఉండే వాళ్లమని, దీంతో చదువుకు, ఇంటి అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో హరీశ్‌రావు సార్ డబుల్ బెడ్‌రూం మంజూరు చేయడంతో తమ కుటుంబానికి ధీమా ఏర్పడిందన్నారు. ఎలాగైనా ఉన్నత స్థానానికి చేరుకోవాలని లక్ష్యంతో ప్రభుత్వ ఉద్యోగాలు రాసినట్లు తెలిపారు. శేరుపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్ 2024లో గురుకుల టీచర్ ఉద్యోగం రాగా, రెండో ఉద్యోగం లాంగ్వేజ్ పండిట్‌గా ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. మూడో ఉద్యోగం స్కూల్ అసిస్టెంట్ దౌల్తాబాద్ మండలం ముబారాస్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో వచ్చిందన్నారు. నాలుగోది జూనియర్ లెక్చరర్‌గా 2025 మార్చి 13లో ఉద్యోగం హన్మకొండలో వచ్చినట్లు సల్మా నేహా తెలిపారు. తన విజయాలకు హరీశ్‌రావు స్ఫూర్తి అని ఆమె పేర్కొన్నారు. మంచిగా చదివి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్న మాటలను సల్మా నేహా నిజం చేసిందని హరీశ్‌రావు అభినందించారు.భర్త మెకానిక్ కావడంతో భర్త కష్టం చూసి, కుటుంబ పరిస్థితి చూసి తపనతో కష్టపడి చదివి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిందని హరీశ్‌రావు మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించారు.

## ప్రభుత్వం కాలువలు నిర్మించడం లేదు

- మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయి..
- ప్రభుత్వ అసమర్థతతోనే పంటలు ఎండాయి..
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- నార్సింగి సబ్ స్టేషన్ సందర్శన



నార్సింగి సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట,మార్చి16: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించి గోదావరి జలాలను తెస్తే.. జలాలను చెరువులు , కుంటల్లోకి తీసుకెళ్లడానికి కనీసం కాలువలు నిర్మించని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో మళ్లీ పాత రోజులు వస్తున్నాయని, కరెంట్ కష్టాలు, కరువు కాటకాలు కనిపిస్తున్నాయని తెలిపారు. నార్సింగి సబ్‌స్టేషన్ లోని 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బ్రేక్ డౌన్ కావడంతో రైతులకు విద్యుత్ అంతరాయం కలుగుతున్న విషయాన్ని తెలుసుకొని ఆదివారం సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేసి రైతులకు విద్యుత్ సరిగ్గా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్పు తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి కరువు కాటకాలు, కరెంట్ కష్టాలు తెచ్చిందని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమానికి కేసీఆర్ కృషి చేస్తే, కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలే దాపురించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు పూర్తిచేసి దుబ్బాక నియోజకవర్గాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయాలని ఏడాదిగా మంత్రులు ,అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నీళ్లు కావాలని రైతులు ఫోన్ చేస్తే విడుదల చేశామని, కాలువలకు నీళ్లు విడుదల చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ దృష్టికి, ప్రాజెక్టు ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లినా తగినన్ని నీళ్లు విడుదల చేయడం లేదన్నారు. ఎండిన పంటల పాపం కాంగ్రెస్‌దే అని విమర్శించారు. అనంతరం నార్సింగిలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, నాయకులు ఆకుల మల్లేశంగౌడ్, భూపతి, నాయకులు, రామాయంపేట ఏడీఈ ఆదయ్య, ఏఈ గణేశ్ తదితరులు ఉన్నారు.



చిన్నకోడూరు బెల్లంకొండ చెరువుకు నీటిని విడుదల చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## కాళేశ్వరం నీళ్లు కనిపిస్తలేవా

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- రంగనాయక సాగర్ లెఫ్ట్ కెనాల్ నుంచి బెల్లంకుంట చెరువుకు నీటి విడుదల

చిన్నకోడూరు, మార్చి 16: కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చిన్నకోడూరుకు వచ్చిన గోదావరి జలాలను చూసి కాంగ్రెసోళ్లు కండ్లు తెరవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలం రంగనాయక సాగర్ లెఫ్ట్ కెనాల్ నుంచి బెల్లంకుంట చెరువుకు ఆదివారం నీటిని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రంగనాయకసాగర్ లెఫ్ట్ కెనాల్ నుంచి చిన్నకోడూర్ బెల్లంకుంట చెరువుకు కాళేశ్వరం నీళ్లు నింపాలనే విజ్ఞప్తితో తాను సొంత డబ్బులు వెచ్చించి పైప్ లైన్ వేయించినట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు. రైతుల పంటలు ఎండకుండా ఉండాలనే ఉద్దేశంతో త్వరితగతిన పనులు పూర్తిచేశామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదన్న కాంగ్రెసోళ్లు ఇక్కడికి వచ్చి జలాలను చూడాలని హితవు పలికారు. బెల్లం కుంట చెరువుకు నీటిని విడుదల చేయడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, నాయకులు మాణిక్య రెడ్డి, శ్రీనివాస్, శ్రీహరి యాదవ్, కనకరాజు, పాపయ్య, జంగిటి శ్రీనివాస్, ఉమేశ్‌చంద్ర, ఇట్టబోయిన శ్రీనివాస్, ములుకల కుంటయ్య, సుంచు రమేశ్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దగోపులారం శివారులో టిప్పర్‌లో నింపుతున్న మట్టి

# కరుగుతున్న గుట్టలు

- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- మునిపల్లి మండలంలో నిత్యం లక్షల రూపాయల దందా

### యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు.. మంత్రి మనుషులమంటూ బెదిరింపులు

మునిపల్లి, మార్చి 16: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొంతమంది తాము మంత్రి దామోదర రాజనర్సింహ మనుషులం అంటూ దర్జాగా మట్టి దందా సాగిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. అక్రమార్కుల దాటికి ముంబయి జాతీయ రహదారి వెంట ఉన్న గుట్టలు కరిగిపోతున్నాయి.పర్యావరణానికి విఘాతం కలుగుతున్నది. మార్కెట్‌లో మొరానికి మంచి డిమాండ్ ఉండడంతో కొందరు అక్రమార్కులు రాత్రీపగలు అని తేడాలేకుండా గుట్టలను తవ్విస్తూ మొరం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ముంబయి జాతీయ రహదారిని ఆనుకొని పెద్దగోపులారం గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గుట్టల వద్ద ప్రయాణికులు ఫొటోలు దిగి అక్కడి ప్రకృతిని ఆస్వాదించేవారు. ప్రస్తుతం ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుపుతుండడంతో అందమైన గుట్టలు మాయమవుతున్నాయి.దీంతో హైవే వెంట వెళ్లే ప్రయాణికులతో పాటు ప్రకృతి ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న మట్టి అక్రమ తవ్వకాలపై సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మునిపల్లి మండలంలోని బుధేరా, పెద్దగోపులారం గ్రామాల శివారులో ఎప్పుడూ పచ్చని అటవీ సంపదతో కళకళలాడుతూ కనిపించే గుట్టలు, ప్రస్తుతం అక్రమ మొరం తవ్వకాలతో మాయమవుతున్నాయి. అక్రమార్జనే ధ్యేయంగా కొందరు జేసీబీలు, టిప్పర్లతో మొరం దోపిడీకి తెగబడుతున్నారు. మునిపల్లి మండలం బుధేరా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గుట్టల నుంచి మొరాన్ని అక్రమంగా తరలిస్తూ వ్యాపారాన్ని సాగిస్తున్నా ఎవరూ చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వెంచర్లు వేసే యజమానులు ప్లాట్లు ఆకర్షణీయంగా కనబడాలనే ఉద్దేశంతో మొరం వేసి ప్లాట్లను చదును చేస్తుంటారు.రోడ్డు పనులను అడ్డం పెట్టుకొని కొంతమంది వ్యాపారులు మొరాన్ని రోజుకు వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మునిపల్లి మండలం నుంచి సదాశివపేట, సంగారెడ్డి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్క మునిపల్లి మండలంలోని రోజుకు అక్రమార్కులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఒక్కో గుట్టను తొలిస్తే రోజుకు 100 ట్రిప్పుల వరకు టిప్పర్లతో మట్టి అక్రమంగా తరలించి బాగా వెనుకేసుకుంటున్నారు.



సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దగోపులారం శివారులో కనుమరుగవుతున్న గుట్టలు

**చర్యలు తీసుకుంటాం...**

మండలంలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. మండలంలో ఎక్కడైనా అక్రమ మొరం తవ్వకాలు జరిపితే, మండలం నుంచి ఇతర మండలాలకు అక్రమంగా తరలిస్తే రెవెన్యూ అధికారులకు ప్రజలు సమాచారం అందించాలి. మొరం తవ్వకాలకు మేము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా మొరం తరలిస్తున్న వారు ఎవరైనా సరే కేసులు నమోదు చేస్తాం. వాహనాలకు జరిమానాలు విధిస్తాం. కొద్ది రోజుల క్రితం మునిపల్లి మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్‌చేసి జరిమానాలు విధించాం. మండల కేంద్రం మునిపల్లికి శివారులో జరుగుతున్న రోడ్డు పనులకు మొరం అవసరం ఉన్నట్లు ఆర్ అండ్‌బి అధికారులు పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. – ఆశాజ్యోతి, మునిపల్లి తహసీల్దార్

## పేద విద్యార్థులను విస్మరించిన కాంగ్రెస్

- కాంగ్రెస్ పాలనలో గురుకులాలు నిర్వీర్యం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల సందర్శన
- విద్యార్థి ఆత్మహత్యాయత్నంపై ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థుల వసతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 16: కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు అధ్వానంగా మారాయని, వసతి గృహాల్లో చదువుకునే పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ సర్కారు చెలగాటమాడుతున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో శనివారం అఖిల్ అనే విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించడం బాధేసిందని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గురుకుల పాఠశాలను సందర్శించి తరగతి గదులు, డార్మెటరీ, బాత్‌రూమ్‌లను ఆయన పరిశీలించారు. 7వ తరగతి విద్యార్థులతో ఎమ్మెల్యే ముచ్చటించారు. అఖిల్ ఆత్మహత్య యత్నానికి గల కారణాలు, గురుకులంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ సర్కారులో గురుకుల, వసతి గృహాల్లో పేద విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు గుణాత్మక విద్యనందించి కంటికి రెప్పలా చూసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో గురుకుల, వసతి గృహాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అటు రైతులను, ఇటు పేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని విమర్శించారు. బలహీన వర్గాల పిల్లలు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలపై సీఎం రేవంత్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో వసతి గృహాల నిర్వహణపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో తరుచూ సమీక్షా సమావేశాలు నిర్వహించేవారమని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. హబ్షీపూర్ గురుకుల పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడే ఆలోచన రావడమనేది చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఏమాత్రం ఆలస్యమైనా అఖిల్ ప్రాణాలు పోయేవని, తోటి విద్యార్థులే అతడి ప్రాణాలు రక్షించారని తెలిపారు. నిలోఫర్‌లో అఖిల్‌కు అందుతున్న వైద్యంపై సంబంధిత వైద్యులతో శనివారం నుంచి ఎప్పటికప్పుడు మాట్లాడి తెలుసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురుకులాల్లో చదువుకునే బలహీన వర్గాల విద్యార్థులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ ఘటనపై అసెంబ్లీలో ప్రశ్నిస్తానని పేర్కొన్నారు. వసతి గృహాన్ని చూసిన ఎమ్మెల్యే సిబ్బందిని నిలదీశారు. విద్యార్థులు చీకటి గదిలో చదువుకోవడం, గోదాం మాదిరిగా ఉన్నా ఒకే గదిలో విద్యార్థులంతా నిద్రించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందకపోవడంతో బలహీనంగా ఉన్నట్లు గుర్తించారు. హబ్షీపూర్ వసతి గృహం కారాగారం మాదిరిగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాశ్, బీఆర్‌ఎస్ నాయకులు కడతల రవీందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాజమౌళి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, వంశీ తదితరులు ఉన్నారు.